రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# సైబరాబాద్ పోలీసుల పనితీరు భేష్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :**

సైబరాబాద్ పోలీసుల పనితీరు బేష్ అని డీజీపీ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆల్ యూనిట్ ఆఫీసర్లతో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి క్రైమ్ రివ్యూ అండ్ ఫంక్షనల్ వర్టికల్స్ సమావేశం నిర్వహించారు. నేరాల నియంత్రణ, పోలీస్ దర్యాప్తు, ఫంక్షనల్ వర్టికల్స్‌పై సమీక్ష నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.... సైబరాబాద్ పోలీసుల పనితీరు, సేవ కార్యక్రమాలు బేష్ అని కొనియాడారు. క్రైమ్ రివ్యూ అండ్ ఫంక్షనల్ వర్టికల్స్‌లో గత 5నెలలుగా సైబరాబాద్ టాప్‌లో నిలిచిందన్నారు. 2020 ఆగస్టు నెల నుండి ఈ ఆన్‌లైన్ క్రైమ్ రివ్యూ ప్రారంభించడం జరిగిందన్నారు. ఈరోజు 23వ క్రైమ్ రివ్యూ సమావేశం జరుగుతుందన్నారు. సైబరాబాద్ పోలీస్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర, జోనల్ డీసీపీలు, క్రైమ్స్ డీసీపీలను, ఎస్‌హెచ్‌వోలు, సిబ్బందిని అభినందించారు. లాంగ్ పెండెన్సీ కేసులను త్వరితగతిన పరిష్కరించడం, గ్రేవ్ కేసులను తగ్గించడంలో, మహిళలు, చిన్నారులకు సంబంధించిన నేరాలను తగ్గించడం, పోక్స్ కేసుల పరిష్కారం, వారెంట్ల జారీ, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ క్రైమ్ వంటి వాటిల్లో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ నెంబర్ 1స్థానంలో ఉందన్నారు. సైబరాబాద్ పనితీరు రాష్ట్రంలో ఉత్తమ స్థానానికి చేరుకునే విధంగా కృషి చేసిన ఫంక్షనల్ వర్టికల్స్ అధికారులందరిని అభినందించారు. ఈసమావేశంలో సైబరాబాద్ నుంచి జాయింట్ సీపీ శ్రీ అవినాష్ మహంతి, క్రైమ్స్ డీసీపీ కల్మేశ్వర్ సింగన్వర్, డీసీపీ ఇందిర, ఏసీపీలు, పంక్షనల్ వర్టికల్ ఏసీపీ శివభాస్కర్, వర్టికల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఆమనగల్లులో రేవంత్‌రెడ్డి సందడి

**ఆమనగల్లు, సెప్టెంబర్30, ప్రభాతవార్త:**

ఆమనగల్లు మండల కేంద్రంలో శుక్రవారం పిసిసి అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి సందడి చేశారు. మాడ్గుల మండల కేంద్రంలో దివంగత కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహా విష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరుతూ మార్గమధ్యలో ఆయన ఆమనగల్లులో పార్టీ శ్రేణులను కలుసుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు మండ్లి రాములు, సీనియర్ నాయకులు ఎంఏ ఖలీల్, కృష్ణ నాయక్, వస్పుల శ్రీశైలం, అలీమ్, వస్పుల మానయ్యలు రేవంత్‌రెడ్డిని కలుసుకుని శాలువా కప్పి స్వాగతించారు. రేవంత్‌రెడ్డి రాక పురస్కరించుకుని కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు నూతనోత్సహంతో కనిపించారు. స్వాగతం పలికిన వారిలో కొప్పు రాఘవేందర్, అండేకర్ రాజశేఖర్, వస్పుల శ్రీకాంత్, ఖాదర్, డి.మహేశ్, శివాజీ, కరీమ్, వాటర్ బాబా, ఎంగలి ప్రసాద్, ఫరీద్, దేవేందర్ తదితరులు ఉన్నారు.



పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలుసుకున్న ఆమనగల్లు కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు

# ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్‌లో దసరా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి దేవాలయాలు, మండపాలలో నవరాత్రి వేడుకల సందర్భంగా వివిధ రూపాలలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడలోని శ్రీదండ్లగడ్డ ప్రసన్నవీరాంజనేయ, మల్లికార్జునస్వామి దేవాలయంలోని రాజరాజేశ్వరీదేవికి నిత్య పూజ, అలంకారాలు నిర్వహిస్తున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆలయంలో ప్రతియేటా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థాన చైర్మన్ కొంతం రాంరెడ్డి తెలిపారు.

# గురుకుల విద్యార్థులను సొంత పిల్లలుగా చూసుకోవాలి

## -జిల్లా కలెక్టర్ నిఖిల



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నిఖిల



హాజరైన గురుకుల పాఠశాల అధికారులు

**వికారాబాద్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**

గురుకులాలు స్వంత ఇంటిలా, అందులో విద్య భ్యసించే పిల్లల్ని సొంత పిల్లలుగా భావించి పనిచేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ నిఖిల పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో వివిధ విభాగాల గురుకుల పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల సిబ్బందికి సెప్టెంబర్ 27 నుండి 30వ తేదీ వరకు నిర్వహించిన ఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వసతి గ్రహాల్లో విద్య అభ్యసిస్తున్న పిల్లల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారుల ు ఆదేశించారు. పిల్లల భవిష్యత్తు ు దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన భోజనాన్ని అందించడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు నామమాత్రంగా కాకుండా మంచి సంకల్పం, సేవాభావంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు భోజనాలు చేసే ప్రాంతాలు, మరుదొడ్లు, బట్టలు ఉతికే స్థలాలు, వెంటిలేషన్స్ శుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. అధికారులు జాబ్ చార్ట్ కు అనుకూలంగా పనిచేయాలని సూచిస్తూ.. విద్యార్థులు ఆరోగ్యపరంగా బాగుండేందుకు యోగ , శారీరక వ్యాయామంపై దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారు, నిర్దేశించబడ్డ సమయాల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారా లేదా అనేది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ప్రిన్సిపాల్స్‌కు కలెక్టర్ సూచించారు. చదువులో మెకబాటులో ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆమె తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల సలహాలు తీసుకొని పాఠశాల అబివృద్ధికి కృషి చేయాలన్నారు. పాఠశాలలో విద్యతోపాటు, విద్యార్థుల అభీష్టం మేరకు వివిధ ఆసక్తి గల కార్యక్రమాలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వసతి గృహాలు అక్టోబరు 6,7 తేదీలలోపు పరిశుభ్ర ప్రక్రియు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న నీటిని శుద్ధి చేసే ఆర్.ఓ.ఆర్ ప్లాంట్లు పరిశుభ్రం చేసి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న క్రమంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలిపారు. ప్రైవేటు భవనాల్లో ఉన్న వసతి గృహాలు, పాఠశాలల మరమ్మత్తులు యజమా ులకు తెలియజేసి సరి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భవనాల్లో చిన్నచిన్న మరమ్మతులు ఉంటే చేయించాలని, మేజర్ సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించి కావలసిన నిధులకై అంచనాలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులతో కలిసి తానే స్వయంగా వచ్చి వసతి గృహాలు తనిఖీ చేస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ అభివృద్ధి అధికారి మల్లేశం, డీటీఓ కోటాజి, మైనార్టీ అభివృద్ధి అధికారి సంధ్యారాణి, ఎంజెపిటిబిసి జిల్లా అధికారి శంకర్, సెక్టోరల్ అధికారి యాసిమ్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి విషయంలో సమాచారం ఇవ్వని ఎంపిటిసి పదవులెందుకు ?

-నిధులు లేని సమావేశాలెందుకు

-గ్రామాల్లో ఎంపిటిసిలకు విలువ లేకుండా పోయింది

-డిఎల్‌పిఓ,డిపిఓలకు కొమ్ముకాస్తున్న ఎంపిఓ మంగతాయారు

- సమావేశాలకు హాజరు కాని అధికారులపై చర్యలు

-అక్రమ నిర్మాణాలకు అడ్డుకోని ఎంపిఓ మంగతాయారు

**కీసర, సెప్టెంబర్30, ప్రభాతవార్త:**

గ్రామాల్లో జరిగే అభివృద్ధి విషయంలో ఎంపిటిసిలకు కనీసం సమాచారం ఇవ్వకపోతే తమకు పదవులేందుకని యాద్గార్‌పల్లి ఎంపిటిసి జూపల్లి వెంకటేష్ అన్నారు. ఎంపిటిసిలకు నిధులు లేక గ్రామాల్లో ప్రజల మధ్య తిరుగలేకపోతున్నామని బోగారం ఎంపిటిసి సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, గోదుమకుంట ఎంపిటిసి మంచాల కిరణ్‌జ్యోతి ప్రవీణ్‌కుమార్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. శుక్రవారం మండల ఎంపిపి మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే ఎంపిటిసి వెంకటేష్ జాతీయ ఉపాధి హామీ పథకం కింద యాద్గార్‌పల్లి గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల విషయంలో కనీసం సమాచారం ఇవ్వడం లేదని అన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మాణాలు, ఎంబీ రికార్డులు అన్ని మండల పరిషత్ కార్యాలయం ద్వారా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయం ద్వారా జరిగే అభివృద్ధి పనులకు కనీసం ఎంపిటిసిలకు సమాచారం ఇవ్వడం లేదని అంకిరెడ్డిపల్లి ఎంపిటిసి పండుగ కవిత శశికాంత్, కీసర ఎంపిటిసి నారాయణశర్మ, యాద్గార్‌పల్లి ఎంపిటిసి వెంకటేష్‌లు ఎంపిడిఓ పద్మావతిని నిలదీశారు. అభివృద్ధి పనుల విషయంలో పంచాయతీ కార్యదర్శులు ఎంపిటిసిలకు సమాచారం ఇవ్వడం లేదని వాపోయారు. ఎంపిటిసిలంటే గ్రామాల్లో విలువ లేకుండా పోయిందన్నారు. నిధులు లేక గ్రామాల్లో అభివృద్ధి చేయలేకపోతున్నామని, ప్రజలు ముఖం చూపించలేకపోతున్నామని ఎంపిటిసిలు వాపోయారు. ప్రతి మూడు నెలలకు జరిగే సర్వసభ్య సమావేశం అప్పుడు మాత్రమే ఎంపిటిసిలు గుర్తుకు వస్తామా అని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరు అయన పనులు తనకు తెలియదని యాద్గార్‌పల్లి పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ చెప్పడం విడ్డూరంగా ఉందని ఎంపిటిసి వెంకటేష్ అన్నారు. దీంతో జడ్పి వైస్ చైర్మన్ కలుగజేసుకుని వేరే పనులు చేయడానికి పంచాయతీ కార్యదర్శులకు సమయం ఉంటుంది గాని ఎంపిటిసిలకు సమాచారం ఇవ్వడానికి సమయం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలలో గ్రామసభలు పెడితే పూర్తి స్థాయిలో అధికారులు రావడం లేదని సర్పంచ్‌లు ఆకిటి మహేందర్‌రెడ్డి, కౌకుట్ల గోపాల్‌రెడ్డి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశాలకు హజరు కాని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపిడిఓ పద్మావతి హెచ్చరించారు. మండలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలకు అదుపు చేయకుండా ఎంపిఓ మంగతాయారు కొమ్ముకాస్తున్నారని అన్నారు. డిఎల్‌పిఓ స్మితకి, డిపిఓ రమణామూర్తికి ఎంపిఓ సమాచారం ఇస్తూ వసూళ్లు చేసి వారికి దండిగా పంచిపెడుతుందని ఎంపిటిసిలు ఆరోపించారు. వెంటనే ఎంపిఓ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సత్తిరెడ్డి, సర్పంచ్‌లు గరుగుల ఆండాలు మల్లేష్, నాయకపు మాధురి, సుంకరి కవిత జైహింద్‌రెడ్డి, మోర విమల నాగరాజు, పిడిశెట్టి పెంటయ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి ఇందిర లక్ష్మీనారాయణ



మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్సీ కవిత



బతుకమ్మ వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవితి

శంషాబాద్‌లోని అమ్మపల్లి సీతారామచంద్రస్వామి ఆలయం ప్రాంగణంలో శుక్రవారం రాత్రి జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న జాగృతి కన్వీనర్ ,ఎమ్మెల్సీ కవిత, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, శంషాబాద్ జడ్పిటిసి నీరటి తన్విరాజు ముదిరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొడిగంటి చంద్రారెడ్డి, ఎంపిపి జయమ్మ శ్రీనివాస్ ,తదితరులు దాదాపు రెండు గంటల సేపు బతుకమ్మ ఆడి తర్వాత చెరువులో నిమజ్జనం చేశారు. అదే సమయంలో గవర్నర్ తమిళి సై విచ్చేసి ప్రత్యేక దర్శనం చేసుకొని వెళ్లిపోయింది.

# గిరిజనుల తాగునీటి కష్టాలు

-నాలుగు రోజులుగా కష్టాలు

- నిధులు లేక మరమ్మతులకు నోచుకోని పంచాయతీ బోరుబావులు



ఓ పొలంలో నుండి త్రాగునీరు తెచ్చుకుంటున్న మహిళలు, చిన్నారులు.

**బషీరాబాద్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** నాలుగు రోజులుగా త్రాగునీరు లేక గిరిజన ప్రజలు అల్లాడిపోతున్న సంఘటన బషీరాబాద్ మండల పరిధిలోని బద్లాపూర్ తాండలో చోటుచేసుకుంది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం గత నాలుగు రోజులుగా తాగునీరు రాకపోవటంతో తమ పిల్లలతో కలిసి ఓ పొలం నుండి త్రాగునీరు పట్టుకొని వస్తున్నామన్నారు. మిషన్ భగీరథ పైపు ఎక్కడో లీకేజీ ద్వారా నీరు కలుషితమై వస్తుందని అన్నారు. తద్వారా ఆ నీరు త్రాగడానికి పనికిరాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో వేసిన బోరు బావులన్నీ మరమ్మత్తులకు గురి కావడంతో గతంలో చేసిన పనుల బిల్లులు రాక పంచాయతీలో నిధులు లేక బోరు మరమ్మత్తు పనులు చేయడం లేదని సర్పంచ్ తెలిపినట్లు తండావాసులు పేర్కొన్నారు. గతంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు రాకపోవడంతో సర్పంచ్ హైదరాబాద్‌లో పనికోసం వెళ్లినట్లు అక్కడి తండా ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు. నాయకులు స్పందించి గిరిజన ప్రజల కష్టాలు తీర్చాలని కోరుతున్నారు. చేసిన అభివృద్ధి పనుల బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లిస్తే గ్రామాలలో ఇలాంటి సమస్యలు ఉండవని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# పెండింగ్ కేసుల శాతం తగ్గించాలి

**వికారాబాద్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** ఇప్పటి వరకు జరిగిన నేరాలకు సంబంధించిన కేసుల పరిశోధన త్వరితగతిన జరిపి పెండింగ్ కేసుల శాతాన్ని తగ్గించాలని డీజీపీ మహేందర్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం డీజీపీ మహేందర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ఇప్పటివరకు జరిగిన నేరాలలో త్వరితగతిన పరిశోధన పూర్తిచేసి పెండింగ్ నేరాల శాతం తగ్గించాలని సూచించారు. క్రైమ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్కింగ్ సిస్టం యందు పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్, కేసుల పరిశోధన వివరాలు ఎప్పటికప్పుడు పొందుపరచాలని అన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ ముమ్మరం చేయడం, బీట్లు ఏర్పాటు చేయడం, రాత్రి సమయాల్లో వాహనాల తనిఖీలు చేసి దొంగతనాల నివారణకు కృషి చేయాలని ఆదేశించారు. 12 వర్టికల్ వ్యవస్థల గురించి క్షుణ్ణంగా చర్చించారు. డయల్ 100 ఫిర్యాదుల పట్ల త్వరితగతిన స్పందించాలని ఆదేశించారు. జిల్లా యొక్క నేరాల గురించి, ఇక్కడి పరిస్థితుల గురించి అడగగ..జిల్లా ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో శాంతియుత వాతావరణం ఉందని, జిల్లాలో ఎటువంటి అసాంఘిక చర్యలు జరగటం లేదని నేరాల ు నివారించేందుకు అన్నీ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలలో సైబర్ నేరాలపట్ల, ఆత్మహత్యల పట్ల గ్రామాలలో పోలీస్ కళాబృందాల ద్వారా అవగాహన సదస్సులు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యకమంలో జిల్లా అదనపు ఎస్పి ఎం.ఎ. రషీద్, వికారాబాద్ డిఎస్‌పి సత్యనారాయణ, పరిగి డిఎస్‌పి కరుణాసాగర్ రెడ్డి, తాండూర్ డిఎస్‌పి శేకర్ గౌడ్, డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ అప్పయ్య, డిఎస్‌బి ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అవార్డులను అందజేస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

# అక్రమ నిర్మాణాలకు ప్రజాప్రతినిధుల అండ .!

- రాజీవ్‌కాలనీలో రోడ్డును ఆక్రమించి నిర్వాణాలు - కన్నెత్తి చూడని అధికారులు



కాలనీలో రోడ్డుపై దర్జాగా చేపడుతున్న నిర్మాణం.



నిరాశ్రయులుగా రోడ్డుపక్కల ఉన్న వృద్ధ దంపతులు.

**తాండూరు, సెప్టెంబరు 30, ప్రభాతవార్త :** అక్రమ నిర్మాణాలకు ప్రజాప్రతినిధులే అండగా నిలుస్తున్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ సమీపంలోని రాజీవ్‌కాలనీలో రోడ్డును ఆక్రమించుకొని దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే, అటువైపు మున్సిపల్ అధికారులు కానీ, గ్రామ పంచాయితీ అధికారులు కానీ కన్నెత్తి చూడటం లేదని విమర్శలు వస్తున్నాయి. అక్రమ నిర్మాణాలను అధికారులే ప్రోత్సహిస్తున్నారని, ప్రజాప్రతినిధులు మాత్రం గృహ నిర్మాణదారుల వద్ద ఇష్టారాజ్యంగా డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధుల అండతో కొంతమంది కాలనీలోని ఖాళీగా ఉన్న స్థలాన్ని ఆక్రమించుకొని దర్జాగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమంగా రోడ్డుపై ఖాళీ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న వ్యక్తుల నుండి కాలనీలోని కొంత మంది పెద్ద మనుషులు ఒక్కొక్కరి వద్ద రూ. 20వేల నుండి రూ.25వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌కాలనీలో నిరుపేదలకు ఇండ్లను కేటాయించింది. అయితే కొంతమంది వాటిని ఇతరులకు విక్రయించారు. కొంతమంది ఇండ్లను ఖాళీగా వదిలేశారు. దీంతో కొనుగోలు చేసిన వ్యక్తులు దర్జాగా అక్కడ ఉన్న ఖాళీ స్తలాన్ని ఆక్రమించి రోడ్డుపైనే నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే ఖాళీగా ఉన్న కొన్ని ఇండ్లను కొంతమంది బ్రోకర్లు కబ్జా చేస్తూ ఇతరులకు విక్రయిస్తున్నారని, అందినకాడికి అబ్బులు దండుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అయితే, ఓ వృద్ధ దంపతులకు సంబంధించిన ఇంటిని కొంతమంది బ్రోకర్లు ఆక్రమించి వారిని బయటికి గెంటివేయడంతో రోడ్డుపక్కల నిరాశ్రయులుగా రోడ్డు పక్కల నివసిస్తున్నారని స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే కానీలో అక్రమంగా రోడ్లను ఆక్రమించుకొని చేపడుతున్న నిర్మాణాలను నిలిపివేయాలని, నిరాశ్రయులుగా ఉన్న వృద్ధ దంపతులకు ఆశ్రయం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా బతుకమ్మ వేడుకలు



జిల్లా ఎస్పీ కార్యాలయంలో బతుకమ్మ సంబురాల్లో బతుకమ్మలకు పూజలు చేసిన జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

### జిల్లా పోలీసు కార్యాలయంలో

వికారాబాద్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త: జిల్లా పోలీసు కార్యాలయంలో బతుకమ్మ పండుగ సంబురాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు మహిళా అధికారులు బతుకమ్మ ఆడి సంబరాలు జరుపుకొన్నారు. సంబురాలలో భాగంగా జిల్లా పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ప్రమీల, డిపిఓ మహిళా సిబ్బంది, బరోసా సిబ్బందితో కలిసి బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి బతుకమ్మకు హారతి ఇచ్చి బతుకమ్మ పూజా కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాలు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పి ఎం.ఎ.రషీద్, వికారాబాద్ డిఎస్‌పి సత్యనారాయణ, ఆర్ఐ రత్నం, ఆర్ఐ అచ్చుతరావు, డీపిఓ సిబ్బంది, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి, అధికారులు, మహిళా అధికారిణిలు, ఉద్యోగులు

### మేడ్చల్ కలెక్టరేట్‌లో

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 30, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా నూతన కలెక్టరేట్ వద్ద శుక్రవారం సాయంత్రం బతుకమ్మ సంబరాలు ఘనంగ జరిగాయి. దీనిలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆట ఆడారు. కలెక్టరేట్ వద్ద బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగ ప్రతి రోజు కొన్ని శాఖల వారితో కొనసాగుతున్నాయి. శుక్రవారం వెనకబడిన తరగతుల అభివృద్ధిశాఖ, షెడ్యూల్డ్‌కులాల అభివృద్ధిశాఖల ఆధ్వర్యంలో రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆటలు ఆడారు. బతుకమ్మ ఆట, పాటలతో సంబరాలు అంగరంగ వైభవంగ జరిగాయి. చిన్నారులు, మహిళలు, గిరిజన సాంప్రదాయ వేషదారణ, విన్యాసాలు, అందరిని ఆకట్టుకున్నాయి. మహిళా ఉద్యోగులు ఆయా శాఖల సిబ్బంది బతుకమ్మ ఆటలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డితో పాటు జిల్లా వెనకబడిన అధికారిణి ఝాన్సీరాణి, పంచాయతీరాజ్ అధికారి రాంమోహన్‌రావు, కలెక్టరేట్ ఎఓ వెంకటేశ్వర్లు, మహిళా అధికారులు, సిబ్బంది తదిరతులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి దేవీగా అమ్మవారు



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**కడ్తాల్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** దేవీ శరన్నవరాత్రోత్సవాలను కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలోని మైసమ్మ దేవాలయం, శివాలయం రామాలయంలో కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. భక్తులు అమ్మవారిని శుక్రవారం మహాలక్ష్మి దేవీగా అలంకరింపజేసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్ ట్రస్టి శిరోలి పంతు నాయక్ మాట్లాడుతూ అమ్మవారి అనుగ్రహానికి ప్రతి ఒక్కరు పాత్రులు కావాలని ఆమె పేర్కొన్నారు. అఖిల లోక పావనిగా వాసవీమాత భక్తులకు అనుగ్రహాన్ని ప్రసాదించునని ఆమె తెలిపారు. ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, సరస్వతిదేవీకి పరివార దేవతలకు అఖండ దీపారాధన, దంపతుల చేత ప్రత్యేక కుంకుమార్చన కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారికి పల్లకి సేవ కన్నుల పండువగా నిర్వహించారు. భగవద్గీత, విస్ణు సహస్రనామ పారాయణాలు చేపట్టారు. ప్రదోష పూజలు, మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణల కార్యక్రమాలను భక్తులకు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తహసీల్దార్ జ్యోతి రాహుల్ దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు గావించారు. కార్యక్రమంలో ఈఓ స్నేహలత, ఉత్సవ నిర్వాహకులు రామావత్ భాస్కర్, అర్చకులు భాను ప్రకాష్, మురళీధర్‌శర్మ, నాగేంద్రశర్మ, ప్రధాన అర్చకులు యాదగిరి, రామచంద్రయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులను కాపాడుకుందాం... భూగర్భాజలాలు పెంచుదాం..

**షాద్‌నగర్, సెప్టెంబర్ 30, (ప్రభాతవార్త) :** దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదినోత్సవాన్ని పురస్కారించుకొని బీజేపీ జాతీయ పార్టీ ఆదేశాలనుసారం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఎస్సీ మోర్చా ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు విఠ్యాల నర్సింహ ఆధ్వర్యంలో ఎలికట్ట గ్రామ శివారు తిమ్మాయకుంటలో చెత్త, ప్లాస్టిక్, చెట్టు కొమ్మల్ని తీసివేయడం లాంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, బీజేపీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అప్పట్లో శ్రీ కృష్ణ దేవరాయల కాలంలో తాగునీటి కోసం తవ్విచిన చెరువులు రాను రాను కబ్జాల రూపంలో కనుమరుగవుతున్నాయని, మిగిలిన కొద్ది పాటి చెరువులనైనా మనం కాపాడుకోవాలన్నారు. చెరువుల్లో పుడిక తీసి, వర్షాలు సహితం ఈ మధ్య బాగా కురుస్తునందున్న భూగర్భజలాలు పెంచేందుకు వీలుగా ఉంటుందని ఈ చెరువులలో రసాయన పదార్ధాలు వ్యర్థ పదార్ధాలు కలవకుండా చూడాల్సిన బాధ్యత మనదే అని అన్నారు. ఈ చెరువుల వలన భూగర్భాజలాలు పెంచడమే కాకుండా సకాలంలో వర్షాలు రాకపోయిన పంటపొలాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేష్, నర్సింలు, మల్లేష్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెరువులో చెత్తను తీసివేస్తున్న బీజేపీ నాయకులు

# వైభవంగా దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు


షాబాద్‌లో దుర్గామాతకు పూజలు చేస్తున్న వాసవీ వనిత క్లబ్ సభ్యులు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**షాబాద్ మండలంలో**
**షాబాద్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు షాబాద్ మండలంలోని షాబాద్, కుమ్మరి గూడ, మల్లారెడ్డిగూడ, హైతాబాద్, తాళ్లపల్లి, సర్దార్‌నగర్ గ్రామాల్లో శుక్రవారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. అమ్మవారి మండపాలు విద్యుత్ కాంతులతో అలంకరించారు. షాబాద్‌లో వాసవీవనితా క్లబ్ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

**కొత్తూర్ పురపాలక పరిధిలో**
**కొత్తూర్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** కొత్తూర్ పురపాలక పరిధిలో శ్రీశివమారుతి హనుమాన్ దేవాలయంలో శ్రీదుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ పి.శేఖర్‌గౌడ్, వేణుగోపాలచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో 5వ రోజు శుక్రవారం శ్రీలలితత్రిపురసుందరి దేవి అవతరంలో అమ్మవారికి ఘనంగా పూజలు చేశారు. బీజేపీ సీనియర్ నాయకుడు పాలమూరు విష్ణువర్దన్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... శ్రీలలిత త్రిపుర సుందరిదేవి అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైన ఉండి ప్రజలందరూ కుటుంబ సభ్యులతో అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని మనసారా కోరుకున్నాన్నారు. భక్తిభవంతో ప్రతి సంవత్సరం దేవినవరాత్రి ఉత్సాహంతో అమ్మవారిని గ్రామాల్లో ప్రతిష్ట చేసి నవరాత్రులు అమ్మవారి మాల ధరించి నిష్ఠగా పూజించడం గొప్ప కార్యమన్నారు. ఆధ్యాత్మిక చింతన వల్ల మానసిక ఉల్లాసంతో ప్రశాంతత జీవితానికి గడపవచ్చు అని అన్నారు. దైవభక్తి కలవారు ప్రతి ఒక్కరితో ప్రేమ ఆప్యాయలతో సోదరా,సోదరి భావంతో కలిసిపోయి ప్రేమను పంచుతారు. దీని ద్వారా హిందూ యొక్క మతాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెబుతుందన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ కొత్తూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎర్రవెల్లి నాగరాజుచారి, బీజేపీ కొత్తూర్ మండల అధ్యక్షులు మల్లారెడ్డి, మహేందర్‌రెడ్డి, కేశంపేట్ మండల అధ్యక్షులు నరసింహ, నందిగామ అధ్యక్షుడు సుధాకర్, ప్రదీప్, శేఖర్ యాదవ్, చరణ్, నిఖిల్, శ్రీకాంత్, ఏ.వేణుగోపాల్, పి.శేఖర్‌గౌడ్, అమ్మవారి మాల ధరించిన స్వాములు ఉన్నారు.

**ఆమనగల్లు పట్టణంలో**
**ఆమనగల్లు, సెప్టెంబర్30, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని శ్రీకన్యకపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న దసర శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం నాటికి ఐదవ రోజుకు చేరుకున్నాయి. అమ్మవారు శ్రీలక్ష్మిదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మహిళలు అమ్మవారి ముందు భక్తిశ్రద్దల మధ్య కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. కుంకుమార్చన కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్య లో హాజరైనారు. అంతకు ముందు పూజారులు శ్రీలక్ష్మిదేవి అవతారంలో ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు వీరబొమ్మ రాంమోహన్‌గుప్త ఆధ్వర్యంలో దేవినవరాత్రి ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టి బికుమాండ్ల యాదయ్య, ప్రధాన కార్యదర్శి బికుమాండ్ల నర్సింహ్మ, బికుమాండ్ల పాండయ్య, బికుమాండ్ల శ్రీనివాస్, జూలూరి గోపాల్‌గుప్త, విష్ణు, మల్లేశ్, కృష్ణ, ఆనంద్, రాగిద్ది లక్ష్మినారాయణ, సురేష్, మండెం చంద్రశేఖర్, దొంతు పెంటయ్య, దొంతు సత్యం, నర్సింహ్మ, రాజలింగం, విజయ్, అర్థం లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.


కన్యకపరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**జిల్లెడు చౌదరిగూడ, సెప్టెంబర్ 30, (ప్రభాతవార్త):**
ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ప్రతి పథకాన్ని అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు.శుక్రవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలో కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 12మందికి కళ్యాణలక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబురాల్లో పాల్గొని బతుకమ్మ ఆడారు. మహిళలు ఎమ్మెల్యేతో కలిసి బతుకమ్మ వేశారు. తెలంగాణలో మహిళల ఆత్మగౌరవాన్ని పెంచిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన పెర్కోన్నారు. మహిళల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్‌బాబు, తహసీల్దారు విజయ్ కుమార్, జడ్పి వైస్ చైర్మన్ ఈట గణెస్, ఏపీఎం రామస్వామి, జడ్పిటీసీ బంగారు స్వరూప, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హాఫీజ్, సర్పంచ్‌లు వెంకటస్వామి, కవితాగోపాల్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ కోనెరు నర్సింగరావు, నాయకులు వెంకటేష్, రాంచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం...


ఆర్థిక సహాయం అందజేస్తున్న జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్

**కడ్తాల్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**
మండలంలో బడుగు, బలహీన వర్గాల వారికి, ఆర్థిక స్థోమత లేని కుటుంబాలను ఆదుకోవడానికి జర్పుల రాధకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తానున్నానని భరోసానిస్తుందని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, కడ్తాల్ జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు ఎవరైన మృతి చెందితే వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ట్రస్ట్ తరుపున రూ. 5వేల ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబాలకు కొండంత భరోసా నిస్తూ ముందుకు సాగుతున్నారు. మండల పరిధిలో గురువారం ముద్విన్ గ్రామానికి చెందిన చాకలి బాలయ్య, సలార్‌పూర్ గ్రామానికి చెందిన చత్రీయలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతి చెందారు. మృతుల కుటుంబాలను జర్పుల రాధకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, కడ్తాల్ జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ పరామర్శించి మృతుల కుటుంబ సభ్యులకు రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఎంపీటీసీ ప్రియ రమేష్ చత్రియ కుటుంబ సభ్యులకు రూ.3వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదయ్య, ఉప సర్పంచ్ వినోద్, డైరెక్టర్ జంగయ్య, నరసింహ, పర్వతాలు, మల్లేష్, వెంకటయ్య, వార్డు సభ్యులు చందు శేఖర్, నాయకులు రాములు, పాండు, జైపాల్, శ్రీను, జంగయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

**వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో మృతుల కుటుంబాలకు పరామర్శ...**
ముద్విన్ గ్రామానికి చెందిన చాకలి బాలయ్య, ఏక్వాయిపల్లి గ్రామంలో చెంచుగూడెంలో చామంతి అనే మహిళ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతి చెందారు.మృతుల కుటుంబాలను వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి నియోజకవర్గ చీమర్ల అర్జున్‌రెడ్డి పరామర్శించి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించి మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు.

## పశువులకు లంపి వ్యాధి నివారణ టీకాలు



**తలకొండపల్లి సెప్టెంబర్ 30,ప్రభాతవార్త :**
పశుశులకు లంపి వ్యాధి రాకుండా ముందుకు జాగ్రత్తగా టీకాలు వేయించాలని టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.శుక్రవారం తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో పశువులకు ఉచితంగా లంపి వ్యాధి నివారణకు టీకాలు వేశారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్,జడ్పి కో ఆప్షన్ సభ్యులు మూజీబుర్ రహేమాన్,పశువైద్యాధికారి విజయ్ ,సిబ్బంది ,హరీష్‌రెడ్డి, పర్వీన్ సుల్తానా,సాజిద్,రామకిష్ణ,గ్రామ కార్యదర్శి శరత్,వార్డు సభ్యులు యాదయ్య,పెంటయ్య గౌడ్,నాయకులు ఎఎంసి డైరెక్టర్ నూకం శేఖర్, దస్తగిరి,రాజు,శ్రీశైలం,తదితరులు పాల్గొన్నారు.

## వెల్జాల్‌లో ఎమ్మెల్యేకు ఘన సన్మానం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**తలకొండపల్లి సెప్టెంబర్30,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు ఘన సన్మానం చేశారు.వెల్జాల్ గ్రామానికి వచ్చిన సందర్భంగా గ్రామ ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు శాలువాలతో ఘన సన్మానం చేశారు.వెల్జాల్ గ్రామం దినదినాభివృద్ధి చెందుతున్నడంతో గ్రామ ప్రజల అవసరం రిత్యా వెంచర్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించుకోవడం శుభ పరిణామమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని కొనియాడారు.వెల్జాల్ గ్రామంలోని చుట్టుపక్కల గ్రామాలకు సైతం బిటి రోడ్డు ఏర్పాటు చేశానని మెదక్ పల్లి వెల్జాల్ వరకు గల అఫ్ కిలోమీటర్ రోడ్డు బిటి రోడ్డు మిగిలిపోయిందని ఆ రోడ్డును పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగీత శ్రీనివాస్ యాదవ్,జిల్లా కో ఆప్షన్ మెంబర్ మూజీబుర్ రహేమాన్ ,ఎంపిటిసి అంబాజీ ,సింగిల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి,వెల్దండ టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపతి రెడ్డి,సింగల్ విండో వైస్ చైర్మన్ కూన్ రవి,సర్పంచ్‌లు హైమావతి రామస్వామి,లలిత జోత్యయ ,వెంకటయ్య,చంద్రయ్య,ఉప సర్పంచ్ అజీజ్,రాంపూర్,యాదయ్య,శేఖర్,బాల కుమార్,మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ మూర్తి,సత్యనారాయణ రాజు,గిరి యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

**వినియోగదారుల కోసం మరింత సృజనాత్మకంగా కొనసాగిస్తాం**
నాగారం సెప్టెంబర్30,ప్రభాతవార్త : రెండు సంవత్సరాల క్రితం ,యూట్యూబ్ షార్ట్స్‌ను ప్రవేశపెట్టింది.ప్రతి ఒక్కరికి అవకాశం ఇవ్వడం,క్రియేటర్లకు ప్రేక్షకులను పెంచడంలో కొత్త వీడియో ఫార్మాట్ల ద్వారా ప్రేరణ పొందడంలో సహాయపడాలన్న తన లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లింది.దాని ప్రారంభం నుంచి యూట్యూబ్ షార్ట్స్ ప్రపంచ వ్యాప్తంగా 150కోట్ల కంటే ఎక్కువ నెలవారీ లాగిన్ ఇన్ వినియోగదారులు కమ్యూనిటిని పెంచింది. రోజుకు 3వేల కోట్ల మంది వీటిని చూస్తున్నారు.ఇది ఒక సంవత్సరం క్రితం కంటే నాలుగు రెట్లు ఎక్కువ యూట్యూబ్‌లో క్రియే టర్ ఆర్థిక వ్యవస్థను రూపొందించడానికి ప్రభావితం చేయడానికి సహాయ పడే ధోరణులు అభివృద్ధి ఇక్కడ ఉన్నాయి.దీన్ని మరింత సృజనాత్మకంగా కొనసాగించడానికి మేము ఎదరు చూస్తున్నామని పలువురు ప్రతినిధులు చెప్పారు

## కనుల పండువుగా ఎల్లమ్మ కళ్యాణోత్సవం

### -భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు

నందిగామ సెప్టెంబర్30,ప్రభాతవార్త : నందిగామ మండలం మేకగూడ గ్రామంలో శుక్రవారం శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం వెద బ్రాహ్మణుల మంతోచ్చరణల మధ్య కనుల పండువగా సాగింది.మేకగూడ గ్రామానికి చెందిన ప్రముఖ సంఘసేవకుడు,ఆలయధర్మకర్త కంకంటి అనంత రెడ్డి,ధర్మపత్ని అరుంధతి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన అమ్మవారి కళ్యాణోత్సవాల వేడుకలకు మేకగూడతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుండి ప్రజలు,భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి అమ్మవారికి మొకుబడులు చెల్లించి ఆశీస్సులు అందుకున్నారు.పచ్చని వ్యవసాయ పంట పొలాల మధ్య,ఆహ్లాదకర వాతావరణంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ జంట నాగుల నాగేంద్ర సహిత శ్రీ రేణుక ఎల్లమ్మ వారి దేవాలయం ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాల వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.ఈ సందర్భంగా కళ్యాణ వేడుకలకు వచ్చిన భక్తులకు ఆలయ ధర్మకర్త అరుంధతి అనంతరెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ వేడుకల్లో ఆలయ ధర్మకర్త కుటుంబీకులు డిసిసిబి డైరెక్టర్ మేకగూడ పిఎసిఎస్ చైర్మన్ కంకంటి మంజులారెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,కంకంటి అజయ్ కుమార్ రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు,చుట్టు పక్కల గ్రామాల ప్రజలు,కంకంటి కుటుంబీకుల అభిమానులు,టిఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


పూజా కార్యక్రమంలో పాల్గొన్న కంకంటి అనంతరెడ్డి ధర్మపత్ని అరుంధతి తదితరులు దృశ్యం

## జీవవైవిధ్యం, నీటివనరుల సంరక్షణ సామాజిక బాధ్యత

**-ఏయూలో సౌరశక్తితో వాతావరణ స్టేషన్**
**-పర్యవేక్షణపై సెమినార్..బహుమతులు అందజేత**


ఏయూలో పర్యావరణశాస్త్ర దినోత్సవంలో భాగంగా వాతావరణ కేంద్రం ఏర్పాటుపై ఒప్పందం తెలియజేస్తున్న ప్రతినిధులు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**
వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా జీవవైవిధ్యం, అటవీ, జనవనరుల సంరక్షణకు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర నీటి అభివృద్ధి వనరుల సంస్థ చైర్మన్ డాక్టర్ వి.ప్రకాశ్‌రావు అన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో పర్యావరణశాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనురాగ్ యూనివర్సిటీ, అమెరికా కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ నుంచి గ్రాంట్ ద్వారా వాతావరణ మార్పుల అవగాహన కార్యక్రమం కోసం పనిచేయడానికి సిటీ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్ (సియుఎన్‌వై), బ్రోంక్స్ కమ్యూనిటీ కాలేజ్ యుఎస్‌తో కలిసి పనిచేస్తుందని తెలిపారు. దీనికి సంబంధించి యూనివర్సిటీ అనురాగ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో పర్యావరణ శాస్త్ర దినోత్సవంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈసందర్భంగా పోస్టర్ ప్రజెంటేషన్, మోడల్ మేకింగ్ పోటీలు నిర్వహించగా వాతావరణ మార్పుగా ఆసక్తిగా కలిగించాయి. హైదరాబాద్‌లోని వివిధ పాఠశాలలు, డిగ్రీకళాశాల, ఇంజనీరింగ్ కళాశాలల నుంచి దాదాపు 500 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర నీటి అభివృద్ధి వనరుల సంస్థ చైర్మన్ డాక్టర్ వి.ప్రకాశ్‌రావు మాట్లాడుతూ యూనివర్సిటీకి ఉమ్మడి అధ్యయనాలు, ప్రాజెక్ట్ కోసం సౌరశక్తితో నడిచే వాతావరణ స్టేషన్‌ను అందించడం శుభపరిణామన్నారు. అమెరికా కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ డేవిడ్ మోయర్, స్కేట్ చైర్మన్ డాక్టర్ స్నేహల్‌దొండే, ముంబాయి స్కేట్ సహజ, పర్యావరణ లైఫ్ అకాడమీనేల చైర్మన్ ముఖ్యప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్లు ప్రొఫెసర్ నీల్‌ఫిలిప్స్, ప్రొఫెసర్ పరమితసేన్‌లు విచ్చేసి వాతావరణ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు రూపొందించిన నమునాలు, పోస్టర్లను పరిశీలించి బహుమతులు అందజేశారు. వాతావరణ వ్యవస్థ పర్యవేక్షణ వ్యవస్థపై అధ్యాపకులు, విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో అనురాగ్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.రామచంద్రం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సైదా సమీన్ పాతిమా, సీఈఓ పల్లా నీలిమ, ప్లానింగ్ అండ్ స్ట్రాటజీ డైరెక్టర్ అనురాగ్ పల్లా, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జి.విష్ణుమూర్తి, పలు విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోచారం మున్సిపల్ సిబ్బందికి దుస్తులు పంపిణీ


.అన్నోజిగూడలో మున్సిపల్ కార్మికులకు కొత్త దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్మన్ తల్లితండ్రులు బోయపల్లి దశలక్ష్మిమల్లారెడ్డి దంపతులు.

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**
పోచారం మున్సిపల్‌లోని 183 మంది కార్మికులకు శుక్రవారం చైర్మన్ కొండల్ రెడ్డి తల్లితండ్రులు చీరలు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి తల్లితండ్రులు అయిన బోయపల్లి దశలక్ష్మిమల్లారెడ్డి దంపతులు దసరా పండుగ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు అన్నదానం చేసిన అనంతరం నాణ్యమైన ధర కల్గిన చీరలను మున్సిపల్ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కార్మికులు సంతోషంతో దసరా బతుకమ్మ పండుగలు జరుపుకోవాలని దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ ఎ. సురేశ్, మేనేజర్ నర్సింహులు, ఏఈ నరేశ్, టీఆర్ఎస్ నాయకులు బోయపల్లి రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వయం కృషితో ఎదగాలి

**షాబాద్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** యువత స్వయంకృషితో ఎదిగి పది మందికి ఉపాధి కల్పించాలని చేవెళ్ల ఎంపీపీ రవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడ గ్రామానికి చెందిన రాజుగౌడ్ నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాయామశాలను షాబాద్ సీఐ గురువయ్యగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... యువత స్వయం కృషితో ఎదిగినప్పుడే దేశం అన్ని రంగాల్లో రాణిస్తుందన్నారు. తమకు అసక్తి కలిగిన రంగాల్లో రాణిస్తూ, పదిమందికి ఉపాధి కల్పించాలన్నారు. రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నాగర్‌గూడ వ్యాపారానికి మంచి అనువైన స్థలం అన్నారు. ప్రతి ఒక్కరు ఉద్యోగం కోసం వేచి చూడకుండా స్వయం కృషితో ముందుకు సాగాలన్నారు. అలాగే శరీర దారుడ్యానికి ఈ వ్యాయామశాలను ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మెన్ ఈదుల నర్సింలుగౌడ్, సర్పంచ్ ఈదుల కృష్ణగౌడ్, పీఆర్ఆర్ఎం యూత్ కార్యవర్గ సభ్యులు ప్రశాంత్‌గౌడ్, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

**ఎమ్మెల్యేపై ఈడి వేధింపులు మానుకోవాలి : గోవర్ధన్‌రెడ్డి**
**యాచారం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ నియోజకవర్గ ప్రజల సమగ్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై ఈడి వేధింపులు మానుకోవాలని మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామ ఉపసర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బడా దోపిడీలకు పాల్పడుతున్న బిజెపి నాయకులను వదిలేసి నిరంతరం ప్రజల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న టిఆర్ఎస్ నాయకులపై ఈడి వేధింపులకు పాల్పడడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈడి, సిబిఐ సంస్థలను బిజెపి తమ జేబు సంస్థలుగా వాడుకుంటూ దేశంలోని అన్ని పార్టీల నాయకులపై లేనిపోని ఆరోపణలతో బెదిరింపులకు పాల్పడుతుందని విమర్శించారు.

**టీఆర్ఎస్ నాయకుడు రాజేందర్‌గౌడ్ మృతి**
**షాబాద్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** టీఆర్ఎస్, గౌడ సంఘం సీనియర్ నాయకుడు సోలిపేట రాజేందర్‌గౌడ్ గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం తెల్లవారు జామున గుండెపోటుతో నగరంలోని స్వగృహంలోనే మృతి చెందారు. షాబాద్ మండలం సంకేపల్లిగూడ గ్రామానికి సోలిపేట్ రాజేందర్‌గౌడ్(51) ఎస్ రాజుగా షాబాద్ మండలంలో అందరికి పరిచయం ఉన్న పేరు. ఆయన టీఆర్ఎస్‌లో ఉన్న పార్టీలకతీతంగా మండల ప్రజల అందరితో కలిసిపోయేవారు. అందరూ రాజు అన్నగా అప్యాయంగా పిలుచుకునేవారు. అలాంటి వ్యక్తి ఒక్కసారిగా గుండెపోటుతో మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయాలు అలుముకున్నాయి.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ


అంజయ్యకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

**యాచారం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** మండలానికి చెందిన భూతరాజు అంజయ్య ఇటీవల అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూన 27 వేల చెక్కును శుక్రవారం భాదితునికి అందజేశారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు మారోజు శ్రీనివాస్, ఖాజా మహ్మద్, ముసుకు రమేష్ పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి టిఆర్ఎస్ పెద్దపీట

**యాచారం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** పేద ప్రజల సంక్షేమానికి టిఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వార్డు సభ్యుల రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొల్లం అనంతరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు సిఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు పథకంతో దళితులకు భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం లబ్ది పొందుతుందన్నారు. రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో రైతుబంధు, రైతుబీమా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రజలందరూ టిఆర్ఎస్‌కు అండగా నిలవాలని ఆయన కోరారు.

## పది రూపాయలకే భోజనం అందజేయడం అభినందనీయం

### - కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బి.సుధీర్

షాద్‌నగర్, సెప్టెంబర్ 30, (ప్రభాతవార్త) : కేవలం పది రూపాయలకే పేద వాడి ఆకలి తీరుస్తూ భోజనాన్ని అందజేస్తున్న షాద్‌నగర్ ఉపాధ్యాయ సేవా వారధి, రామలింగేశ్వర సహకార సంఘం, కల్ప వృక్షా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బి.సుదీర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన పది రూపాయల భోజనం ప్యాకెట్ల సరఫరాను శుక్రవారం 5వ రోజు సుదీర్ ప్రారంభించారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు భోజనాల కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. పది రూపాయలకు అన్నం, పప్పు, చెట్నీలతో కూడిన భోజనం ప్యాకెట్లు సరఫరా చేయబడునని బీద వాళ్లు వరైనా ఉంటే జీహెచ్ఆర్ ఫంక్షన్ హాల్ ముందు కేశంపేట రోడ్డులో తీసుకొని వెళ్లగలరని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆశంబాబు, బాలరాజుగౌడ్, నటరాజ్, పాండురంగయ్య, నాజర్‌అలీ, వెంకటయ్య, నర్సింములు శ్రీధర్‌రెడ్డి, బుచ్చయ్య, శ్రీశైలంగౌడ్, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

## ఎలికట్ట దర్గాను సందర్శించిన కేశంపేట ఎంపిపి రవీందర్‌యాదవ్


ఎంపీపీ రవీందర్‌యాదవ్‌ను సన్మానిస్తున్న దర్గా నిర్వాహకులు

**షాద్‌నగర్, సెప్టెంబర్ 30, (ప్రభాతవార్త) :** ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలోని దర్గా హజరత్ అబ్బాస్ షా ఖాద్రీ చిష్టిపీర్ గయబ్ సాహెబ్ దర్గాను శుక్రవారం కేశంపేట మండల ఎంపీపీ రవీందర్‌యాదవ్ సందర్శించారు. రవీందర్‌తో పాటు ఫరూక్‌నగర్ మండల ఎంపీపీ ఖాజాఇద్రీస్, జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని దర్గా నిర్వహకులు ఘన స్వాగతం పలుకుతూ శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ... దర్గాను సందర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని, దర్గా అభివృద్ధి కోసం తమ వంతు సహాయ సహాకారాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలికట్ట గ్రామ సర్పంచి సాయిప్రసాద్‌యాదవ్, దర్గా నిర్వాహకుడు మహమ్మద్ అన్వర్ పాషా ఖాద్రీ దర్గా సజ్జదే నాషీన్ ముతవల్లి తదితరులు పాల్గొన్నారు.

## పంటలను పరిశీలించిన అధికారులు


పంటలను పరిశీలిస్తున్న అధికారులు

**తలకొండపల్లి సెప్టెంబర్30,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల అంతారం గ్రామమానికి చెందిన సొడవాని వెంకటయ్య,ఎనుముల శంకర్,ఎర్రోళ్ల శ్రీను,భగవాన్,ఎనుముల కృష్ణయ్య,రాములు,ఫకీరా,భీమయ్య,కావలి పాపయ్య,మల్లయ్యల పొలాలలో క్షేత్రస్థాయిలో వరి,మొక్కజోన్న పత్తి,కంది పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా కురుస్తున్న వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు చిడా పీడల,తెగుళ్ల నివారణ చర్యలు రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సొడమోని వెంకటయ్య,వ్యవసాయ అధికారి రాజు,వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్,రైతులు పాల్గొన్నారు.

**విఆర్ఎలకు బియ్యం అందజేత**
**తలకొండపల్లి సెప్టెంబర్30,ప్రభాతవార్త :** గత 60రోజులుగా తమ సమస్యల సాధనకై సమ్మె చేస్తున్న మండల విఆర్ఎలకు 10కిలోల చొప్పున తలకొండపల్లి రైస్ మిల్లర్లు అయినటువంటి కండె జగదీశ్వర్ ,కండె మధుసూదన్ దాతృత్వంతో బియ్యాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ,డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్,సీనియర్ అసిస్టెంట్ బాలవర్ధన్,మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మంజుల రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ


మహిళాలకు చీరలు అందజేస్తున్న సర్పంచ్,తదితరులు

**తలకొండపల్లి సెప్టెంబర్30,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల పరిధిలోని మెదక్ పల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బతుకమ్మ చీరలను సర్పంచ్ ధరణి శివ శంకర్ రెడ్డి చేతులు మీదుగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్ పంచాయతీ కార్యదర్శి రమేష్ నాయక్,జర్నలిస్ట్ శంకర్,వార్డు సభ్యులు రాజు,యాదమ్మ, కిష్టమ్మ,ఫీల్డ్ అసిస్టెంట్ రామచంద్రయ్య,టిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు వెంకటేష్ రైతు సమన్వా సమితి అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, మాజీ సర్పంచ్ మల్లమ్మ,ఆశావర్కర్ జంగమ్మ, గ్రామస్తులు, చుక్కలయ్య,పర్వతాలు,జంగయ్య,సంతు నరేందర్,పాల్గొన్నారు.

**వెంకట్రావు పేట గ్రామంలో :** మండల పరిధిలోని వెంకట్రావు పేట గ్రామంలో దసరా పండుగ కానుకగా బతుకమ్మ చీరలను సర్పంచ్ కెంచ హైమావతి రమేష్,గడ్డమీది తండా సర్పంచ్ ఈశ్వర్ నాయక్,ఎంపిటిసి సరిత గణేష్ గుప్తా తదితరులతో కలిసి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంఛ్ రవి,టిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజు,ఎస్ఎంసి చైర్మన్ రమేష్ వార్డు మెంబర్ విష్ణు, పాండురంగయ్య,రమేష్,రాములు నాయక్,దశరథం,మాజీ ఉప సర్పంచ్ చంద్రయ్య,పంచాయతీ కార్యదర్శులు జమీర్ విజయ్ కుమార్,ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ,అంగన్‌వాడీ టీచర్,ఆశా వర్కర్స్ ,మహిళా సంఘం సభ్యులు నాయకులు ఎల్లయ్య,ఈదన్నా ఎల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.

**నూతన పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ**
**జిల్లెడు చౌదరిగూడ, సెప్టెంబర్ 30, (ప్రభాతవార్త):**
జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఇంద్రానగర్ గ్రామంలో నూతన పాఠశాల భవణ నిర్మాణానికి సర్పంచ్ మహబూబీ భూమి పూజ చేశారు. గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన గురుకుల పాఠశాల ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీంతో గ్రామంలో పాఠశాల భవనం లేకపోవడం వల్లన చౌదరిగూడ గ్రామాలనికి చెందిన ఆకారపు నాగరాజు తన స్వంత ఖర్చులతో ఎనిమిది గదులు నిర్మించేందుకు డబ్బులు చెల్లించనున్నట్లు క్రటించారు. ఈ మేరకు శుక్రవారం భూమి పూజ చేశారు. విద్యార్థుల కోసం స్వంత డబ్బులు ఖర్చు చేయడం ఎంతో అభినందనీయమని గ్రామస్తులు అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నాగరాజును శాలువాలతో సన్మాణించారు. ఈ కార్యమ్రంలో జడ్పిటీసీ స్వరూప, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హాఫీజ్, నాయకులు అక్రమ్, వెంకటేష్,శేఖర్, రాంచంద్రయ్య,రాములు తదితరులు పాల్గొన్నారు.

**చిల్కూర్ గురుకుల విద్యార్థులకు రూ.11,80 లక్షల నగదు బహుమతి**
**మొయినాబాద్ 30, సెప్టెంబర్, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండలంలోని చిల్కూర్ గ్రామ పరిధిలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సహం అందించింది, 2020 మరియు 21 ఇంటర్ మీడియట్ కళాశాల విద్యార్థులకు ఆర్థికంగా ప్రభుత్వం ప్రోత్సాహం అందించింది, ప్రిన్సిపల్ శౌరి రాజ్ తెలిపిన వివరాల ప్రకారం, 2021 విద్యా సంవత్సరంలో ఇంటర్‌మీడియట్ పూర్తిచేసి విద్యార్థులు 7 ఐఐటి సీట్లు, 13 మంది విద్యార్థులు ఎంబిబిఎస్ సాధించారు, 5 మంది విద్యార్థులు దేశంలోని ప్రముఖ యూనివర్సిటిలో సీట్లు సాదించారని ప్రిన్సిపల్ తెలిపారు. కరోనా మహమ్మారి వజృంబిస్తున్న తరుణంలో ఉపద్యాయులు ప్రోత్సహించారు, విద్యార్థులతో నిత్యం అందుబాటులో ఉండి ఆన్‌లైన్‌లో విద్యార్థులకు భోదనలు చేశారు, విద్యార్థులకు కూడ కష్టపడి చదివి ఉత్తమ పలితాలను అందుకున్నారన్నారు, ప్రభుత్వం విద్యార్దుల పట్టుదలను చూసి విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సహించాలని నిర్ణహించు కోని విద్యార్దులకు 50 వేల రూపాయలు, దేశంలోని ప్రముఖ యూనివర్సిటిల్లో సిట్లు సాధించిన విద్యార్థులకు 30వేల చోప్పున బహుమతిని అందజేసారు, మొత్తం కలిపి విద్యార్దులకు 11 లక్షల 80వేల రూపాయల నగదు బహుమతి అందజేసినట్లు ప్రిన్సిపల్ ఒ ప్రకటనలో తెలిపారు.

## సాదాసీదాగా సాగిన సర్వసభ్య సమావేశం



సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మహేష్‌బాబు

**జిల్లెడు చౌదరిగూడ, సెప్టెంబర్ 30, (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ యాదమ్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సదాసీదాగ కొనసాగింది. మండలంలోని ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫర కావడం లేదని సభ్యులు సభా దృషికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన అధికారులు సమస్యలను పరిష్కారిస్తామని తెలిపారు. గ్రామాల్లో ఇదివరకు వేసిన సీసీ రోడ్లు, రైతు వేదికలు పూర్తి చేసినప్పటికి బిల్లులు రావడం లేదని సభ్యులు తెలిపారు. క్రీడా ప్రాంగణాలు పనులు చేయించారు కాని ఇప్పటి వరకు ప్రణాళికలు తయారు చేయలేదని తెలిపారు. గ్రామాల్లో చేపట్టిన ప్రతి పనికి ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తాయని సంబంధిత అధికారులు సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటీసీ బంగారు స్వరూప, ఎంపీడీఓ మహేష్ బాబు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

-సర్పంచ్ పెద్ద కుర్వ శివలీల


చెరువులో చేప పిల్లలను వదులుతున్న సర్పంచ్ తదితరులు

**పెద్దేముల్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని సర్పంచ్ పెద్ద కుర్వ శివలీల అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలంలోని రుక్మాపూర్ ప్యాట చెరువులో, బచ్చుకుంటలో 12 వేల చేప పిల్లలను మత్స్యకారుల సంఘం అధ్యక్షులు సందమోల్ల శ్రీనివాస్ ముదిరాజ్‌తో కలిసి వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యం తో ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే టిఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమం లో మత్స్యకారుల సంఘం వైస్‌చైర్మెన్ బొగ్గుట శ్రీనివాస్ ముదిరాజ్, ట్రేజరర్ సురేందర్ ముదిరాజ్, సంఘ ప్రతినిధులు చిట్లపల్లి శ్రీనివాస్, రవి ముదిరాజ్, బాలు, టీ.జగదీశ్వర్ ముదిరాజ్, బాబు ముదిరాజ్, శేఖర్ ముదిరాజ్, ఎస్.వెంకటయ్య, ముదిరాజ్, సి.మనీష్, టిఆర్ఎస్ నాయకులు పెద్ద కుర్వ మల్లేశం పాల్గొన్నారు.

## ముదిరాజ్ ముఖ్యనాయకుల సమావేశం


సమావేశంలో పాల్గొన్న ముదిరాజ్ సంఘం నాయకులు.

**బొంరాస్‌పేట్, సెప్టెంబర్30, ప్రభాతవార్త :** ఎస్ గార్డెన్ పరిగి నియోజకవర్గంలో ముదిరాజ్ ముఖ్యనాయకుల సమావేశం శుక్రవారం నాడు నిర్వహించారు. ఈ సమావేశానికి బొంరాస్‌పేట్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తిరుపతయ్య, మండల నాయకులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న ముదిరాజ్‌ల బిసి'డి' గ్రూపు నుండి బిసి'ఎ'కు మార్పుపై ఉన్న స్టేను ఎత్తివేయించడంతో ముదిరాజ్‌ల విద్యా, ఉపాధి రంగాలలో సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి కొరకు అన్ని జిల్లాలలో ముఖ్య నాయకుల సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి బాబయ్యనాయుడు, అంజిలయ్య, వెంకటయ్య, హన్మంతు, నర్సిములు, రవీందర్, తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు


బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థులు

**తాండూరు, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ సంబురాలు తాండూరు పట్టణంలో ఘనంగా జరుపుకొన్నారు. తాండూరు పట్టణంలోని శాలివాహన డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు జరుపుకొనే బతుకమ్మ వేడుకలలో భాగంగా శుక్రవారం అలిగిని బతుకమ్మతో వేడుకలు జరుపుకొన్నారు. పెద్ద ఎత్తున మహిళలు, అధ్యాపకులు, విద్యార్థులు రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మను తీసుకువచ్చి సంబరంగా బతుకమ్మ ఆట ఆడుతూ పాటలు పాడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బతుకమ్మ పండగ విశిష్టతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కరణ్‌కోట్ ఎస్ఐ విమల, రిటైర్డ్ అధ్యాపకులు మల్లేశం, కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కరస్పాండెంట్ అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ శరత్‌చంద్ర, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, మాధవరెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దనందిగామలో పౌరహక్కుల దినోత్సవం

**కొడంగల్ రూరల్, సెప్టెంబర్, 30 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పెద్దనందిగామలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్ శారదమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎస్సై ఏ.రవి మాట్లాడుతూ బాల్య వివాహాలు, మానవ హక్కులు, ఎస్సీ, ఎస్టీ చట్టాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


పౌర హక్కులపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఏ.రవి

# కష్ట కాలంలో సైతం ఆగని సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే ఆనంద్


కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

**మర్పల్లి సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా టిఆర్ఎస ప్రభుత్వం పనిచేస్తుందని కష్ట కాలంలో సైతం సంక్షేమ పథకాలు ఆగలేవని వికారాబాద్ ఎమ్మెల్మే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం మర్పల్లి మండలంలోని మల్లికార్జునగిరిలో మీతో నేను కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎంపిటీసి అధికారులతో కలసి గ్రామంలో పర్యటించి గ్రామ సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, మురుగుకాల్వలు విద్యుత్, మంచినీరు వంటి మౌలిక సమస్యలు ఏమైనా ఉన్నాయా అని గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలు అభివృద్ధి చెందిన నాడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కుల మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కష్టకాలంలో, కరోనా సమయంలో సైతం కళ్యాణ లక్ష్మి రైతుబంధు పెన్షన్లువంటి పథకాలు అమలు చేసిన ఘనత ప్రభుత్వానికి దకుతుందన్నారు సంక్షేమ పథకాలతో పాటు గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు పారిశుద్ధ్యం పచ్చదనంఎంతో ముఖ్యమన్నారు అనంతరం మర్పల్లి ఎపిడివో కార్యాలయంలో ఎంపీపీ లలితతో కలసి కళ్యాణ లక్ష్మిచెక్కుల పంపిణీ చేశారు. ఈసమావేశంలో జడ్పిటీసి మదుకర్ ఉపాధ్యక్షులు మొహన్‌రెడ్డి రైతు సంఘం అధ్యక్షులు నాయబ్‌గౌడ్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శీ అశోక్ యువజన సంగం అధ్యక్షులు మదు నాయకులు రాచన్న పలు శాఖలఅధికారులు వివిధ గ్రామాల సర్పంచ్‌లు నాయకులు పాల్గొన్నారు

## ఘనంగా బతుకమ్మ సంబరాలు


ఫొటోరైటప్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు.

**బీసీ మహిళా సంఘం ఆద్వర్యంలో**

**తాండూరు, సెప్టెంబరు 30, ప్రభాతవార్త :** తాండూరు నియోజకవర్గ బీసీ మహిళా సంఘం ఆద్వర్యంలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం తాండూరు నియోకవర్గ బీసీ మహిళా అధ్యక్షురాలు జ్యోతి ఆద్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను రంగురంగుల పూలతో అందంగా తయారుచేసి తీసుకువచ్చి సంబరంగా బతుకమ్మ ఆట ఆడుతూ పాటలు పాడారు. ఈ వేడుకలలో జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యులు తాండూరు నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్, బీసీ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు మధులత, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ షకూర్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సాంప్రదాయాలను, ఆచారాలను గౌరవిస్తూ బీసీ సంఘం ఆద్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్, మహిళా ఉపాధ్యక్షురాలు అనితా, కార్యదర్శి గూటికే విజయలక్ష్మి, విజయ, సర్సమ్మ, వివిద మండలాల అధ్యక్షులు లక్ష్మణచారీ, నరేందర్, బసంత్‌కుమార్, నాయకులు జుంటుపల్లి వెంకట్, బస్సు, రాము పాల్గొన్నారు.


బతుకమ్మ వేడుకలో పాల్గొన్న నాయకులు.

**ముదిరాజ్ గ్రామసంఘం అధ్వర్యంలో**

**బొంరాస్‌పేట్, సెప్టెంబర్30, ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండలం బురాన్‌పూర్ గ్రామంలో తెలుగు సంఘం అధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వికారాబాద్ జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ రాంచంద్రయ్య, వైస్ఎంపిపి సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. బతుకమ్మ సంబురాలలో భాగంగా తంగేడు, గునుగు, బంతి, చెమంతి, తదితర పూలతోపేర్చి గౌరమ్మను పూలపై పెట్టి మహిళాలు ఆటపాటలతో బతుకమ్మను అడారు. కార్యక్రమంలో ముదిరాజ్ గ్రామ అధ్యక్షులు పెంటయ్య, వైస్‌ప్రెసిడెంట్ సాయిలు, కోశాధికారి శ్రీశైలం, ముదిరాజ్ సంఘం నాయకులు, మహిళాలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యువత క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలి


క్రీడాకారులకు ఐక్యత ఫౌండేషన్ తరపున క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న గన్నోజు సత్యం

**ఆమనగల్లు, సెప్టెంబర్30, ప్రభాతవార్త:** క్రీడారంగంతో సమాజంలో కీర్తిప్రతిష్టతలు పొందవచ్చని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు గన్నోజు సత్యం అన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుని ప్రతిభ పాటవాలను ప్రదర్శించాలని ఆయన సూచించారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన యువకులకు ఐక్యత ఫౌండేషన్ సమకూర్చిన క్రికెట్ కిట్‌ను ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం గన్నోజు సత్యం అందజేశారు. అనంతరం సత్యం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, సరైన ప్రోత్సహం లేక వారి ప్రతిభ మరుగునపడుతుందని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తే వారు మరింతగా రాణిస్తారని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. క్రికెట్ కిట్‌ను ప్రధానం చేసిన ఐక్యత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకిని రాఘవేందర్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులకు క్రీడాకారులు నాగులపల్లి శ్రీకాంత్, డిష్ నర్సింహ్మ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, కానుగుల శేఖర్, భాస్కర్, నరేష్, గణేశ్, సైదులు, రాజు, మహేశ్ తదితరులు ఉన్నారు.

## కాంట్రాక్టర్‌లకు బిల్లులు చెల్లించాలని అందోళన

**కీసర, సెప్టెంబర్30, ప్రభాతవార్త:** మండలంలో వివిద గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులకు సంబందించిన బిల్లులు వెంటనే చెల్లించాలని మండల కాంట్రాక్టర్‌లు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌లు మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేసి మూడు సంవత్సరాలు పడుతున్నా ఇంతవరకు నిధులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. పాత బిల్లులు చెల్లించే వరకు మండలంలో ఏ గ్రామాల్లో నూతన పనులు చేయబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్‌లు సింగోజి నర్సింహ్మాచారి, రంగారెడ్డి, దాసు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని ఆందోళన చేస్తున్న

## బసవ భవన నిర్మాణానికి కృషి


బసవ భవన నిర్మాణానికి భూమి పూజ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సంఘం సభ్యులు

**షాబాద్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** బసవ భవన నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు హూప్ ఫౌండేషన్ చైర్మెన్ విజయ్‌కుమార్ తెలిపారు. షాబాద్ మండల కేంద్రంలో వీరశైవ సమాజం ఆధ్వర్యంలో బసవ భవనం నిర్మించేందుకు భూమిపూజ వాల్ పోస్టర్‌ను శుక్రవారం షాద్‌నగర్ వీరశైవ సమాజ అధ్యక్షులు ప్రవీణ్‌తోకలిసి విడుదల చేశారు. ఈకార్యక్రమంలో ప్రచార కార్యదర్శి సర్వం, షాబాద్ వీర శైవ సమాజం సభ్యులు లింగప్ప, మలికార్జున్, ప్రదీప్, దీపక్, శ్రవణ్, శేఖర్, శ్రీనివాస్, రాజేష్, కృష్ణ, బస్వరాజ్ పాల్గొన్నారు.

## షాబాద్ ఎంపిడివో కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు


షాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో బతుకమ్మ సంబురాలలో అధికారులు

**షాబాద్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** తీరొక్క పూలతో షాబాద్‌లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ చుట్టు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనురాధా, మహిళా సమాఖ్య సభ్యులు, అధికారులు ఉన్నారు.

# ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండా సర్వే చేయాలి

-హద్దులు ఏర్పాటు చేయాలి

-మూడుచింతలపల్లి సర్వసభ్య సమావేశంలో గ్రామాల ప్రజాప్రతినిధుల డిమాండ్

-కొత్త సర్వేయర్ వచ్చాక వెంటనే పంపిస్తాం : తహసీల్దార్

-గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలి : ఎంపిపి

**శామీర్‌పేట, సెప్టెంబరు 30, ప్రభాతవార్త** గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండ సర్వేచేయించి హద్దులు ఏర్పాటు చేసి గ్రామ ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగ చూడాలని పలు గ్రామాల ఎంపిటిసిలు, సర్పంచులు మూడుచింతలపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో డిమాండ్ చేశారు. శుక్రవారం మూడుచింతలల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి వి.హారికమురళీగౌడ్ అధ్యక్షతన జరిగింది. ఎంసిపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో గ్రామాల్లో ఉన్న సమస్యలను సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాత్రినిధులు లేవనెత్తారు. పలు అంశాలపై సుదీర్ఘంగ ప్రజాప్రతినిధులు, అధికారులు చర్చించారు. జగ్గంగూడ, కేశవరం, అనంతారం, నారాయణపూర్, అద్రాస్‌పల్లి, లక్ష్మాపూర్, మూడుచింతలపల్లి గ్రామాల్లో ఉన్న రెవెన్యూ పర సమస్యలపై లేవనెత్తి పరిష్కరించాలని, కొన్ని నెలల కిందట ప్రభుత్వ భూముల సర్వే కోసం దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఇంత వరకు సర్వే చేయలేదని పలువురు సభ్యులు పేర్కొన్నారు. కేశవరంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాల కోసం కేటాయించిన 226సర్వే నెంబరు కొంత భూమి కబ్జాలు జరుగుతున్నట్లు, ప్రభుత్వ భూమి బోర్డును కూడ తొలగించారని ప్రభుత్వ భూమిని సర్వేచేసి కాపాడాలని కేశవరం ఎంపిటిసి సభ్యుడు గోనె హన్మంతరెడ్డి తహసీల్దార్ వాణిని కోరారు. కేశవరం గ్రామ పరిధిలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నట్లు, పేదలకు శాపంగ, ఇతరులకు మోక్షంగ అక్రమ నిర్మాణాలు మారాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగ అద్రాస్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ భూమి సర్వేనెంబరు 235గల భూమిని సర్వేచేయించాలని ఆయన కోరారు. జగ్గంగూడలో ప్రభుత్వ భూమి సర్వేనెంబరు 540గల భూమి కొంత భూమి కబ్జాలో ఉందని పరిష్కరించాలని జగ్గంగూడ సర్పంచు సిహెచ్ విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. అనంతారం గ్రామంలో 149సర్వేనెంబరు ప్రభుత్వ భూమిని సర్వేచేయాలని ఆ గ్రామ సర్పంచు ఎం.నర్సింహ్మారెడ్డి కోరారు. గ్రామ ప్రయోజనాలకు ఆ భూమిని వాడుకుంటామన్నారు. అనంతారం చెరువు నుంచి నీరు వృధాగ వెళుతుందని మరమ్మతులు చేపట్టాలని ఇరిగేషన్ ఎఇ దృష్టికి సర్పంచు నర్సింహ్మారెడ్డి తెచ్చారు. నారాయణపూర్ గ్రామంలో 25ఎ సర్వేనెంబరు, 126సర్వేనెంబరు ప్రభుత్వ భూములను సర్వేచేయాలని ఆ గ్రామ సర్పంచు యు.రాంచంద్రయ్య కోరారు. లక్ష్మాపూర్‌లో పట్టాదారు భూముల ఖాతాలు పెండింగ్‌లో ఉన్నవి పరిష్కరించాలని ఆ గ్రామ సర్పంచు సింగం అంజనేయులు తహసీల్దార్ వాణిని కోరారు. వీటికి తహసీల్దార్ వాణి స్పందిస్తూ మండల సర్వేయర్ బదిలీ అయినట్లు, కొత్త సర్వేయర్ రాగానే సర్వే చేయిస్తానని అన్నారు. రెవెన్యూ ఫీల్డ్ స్టాఫ్ సరిపోను లేరని గ్రామాల ప్రజాప్రతినిధులు రెవెన్యూపరంగ సహకరించాలని, ఓటరు, ఆధార్‌కార్డు అనుసంధానం చేస్తున్నట్లు ఆధార్‌కార్డులు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ సూచించారు. ఎంపిపి వి.హారికమురళీగౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రజాప్రతినిధులు సూచించిన వాటిని అధికారులు పరిష్కరించాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపిడిఓ బి.రవి మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు నేషనల్ అవార్డులు ఇవ్వనున్నారని, నిబంధనల ప్రకారం అర్హత ఉన్న వాటిని ఎంపిక చేస్తారని, అన్ని గ్రామపంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు సరిచూసుకోవాలని, గ్రామాలను టీమ్‌లు పర్యటించనున్నట్లు సూచించారు. గ్రామాల్లో యూత్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని అభివృద్ధికి దోహదపడనున్నట్లు ఆయన సూచించారు. ఆసరా ఫించన్లు మీసేవా ద్వారా దరఖాస్తులు చేసుకుంటే మంజూరు కాలేదని వాటిని పరిశీలించాలని గ్రామాల సర్పంచులు విష్ణువర్ధన్‌రెడ్డి, జామ్‌రవి కోరారు. గ్రామాలలో మరుగుదొడ్ల నిర్మాణాల మంజూరుకు మరోసారి ప్రతిపాదనలు తీసుకుని మంజూరు చేయాలని ఎంసిపల్లి సర్పంచు జామ్‌రవి, మరి కొందరు సర్పంచులు సూచించారు. డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ మూడుచింతలపల్లిలో గోదాం నిర్మాణ పనులు జరుగుతున్నట్లు, సొసైటీ ద్వారా మరిన్ని సేవలు అందించటానికి, వరిధాన్యం కొనుగోలు కేంద్రాల కొనసాగిస్తామన్నారు. ఈ సర్వసభ్య సమావేశంలో వైస్‌ఎంపిపి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, పలు గ్రామాల ఎంపిటిసిలు, సర్పంచులు, కోఆప్షన్‌సభ్యులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



మూడుచింతలపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎంపిపి వి.హారికమురళీగౌడ్, డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, వైస్‌ఎంపిపి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపిడిఓ బి.రవి, తహసీల్దార్ వాణి, తదితరులు

## మండల మహిళా సమాఖ్యను అభివృద్ధి పథంలో నడిపిస్తాం

-అధ్యక్షురాలు పుల్లగోని సుజాత

**పెద్దేముల్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** మండల మహిళా సమాఖ్యను అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని అధ్యక్షురాలు పుల్లగోని సుజాత అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో 37 గ్రామ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు కలిసి మండల సమాఖ్యనూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పుల్లగోని సుజాత -రుక్మాపూర్, ఉపాధ్యాక్షురాలు యశోద- కందనెల్లి, కార్యదర్శి అక్షయ-పెద్దేముల్ -1, సహయ కార్యదర్శి పద్మమ్మ -రేగొండి, కోశాదికారిగా మంజుల-ఇందూరు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మహిళా సమాఖ్యను మరింత అభివృద్ధి చెందెందుకు తమ వంతు కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం బాలయ్య, సీసీలు సత్యనారాయణ, అనంతయ్య, సయిాద్, లక్ష్మయ్య, మంజుల, వెంకటేష్, బాల్‌రాజ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా చాంద్‌పాషా

**బొంరాస్‌పేట్, సెప్టెంబర్30, ప్రభాతవార్త :** నూతన మండలం దుద్యాల్‌లో టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షునిగా గౌరారం సర్పంచ్ చాంద్‌పాషా ఎన్నికకావడం జరిగిందని బొంరాస్‌పేట్ మండల అధ్యక్షులు కోట్ల యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదేశానుసారం దుద్యాల్ మండల కేంద్రంలో శుక్రవారం నాడు టీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఎన్నికలో చాంద్‌పాషాను ఏకగ్రీవంగా అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగిందని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, టీటీ రామునాయక్, రైతుబంధు అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, మడిగే శ్రీనివాస్, నరేష్‌గౌడ్, బసిరెడ్డి, జావిద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమమే సిఎం కెసిఆర్ ప్రభుత్వ లక్ష్యం

-ఎంపిటీసిల ఫోరం రాష్ట్ర ఉపాధ్యాక్షులు వెంకటేష్‌చారీ


బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న వెంకటేష్‌చారీ తదితరులు

**పెద్దేముల్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** మహిళల సంక్షేమమే సిఎం కేసిఆర్ ప్రభుత్వ లక్ష్యమని యంపిటీసిల ఫోరం రాష్ట్ర ఉపాధ్యాక్షులు వెంకటేష్‌చారీ అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలంలోని బుద్దారం, బండపల్లి, ఖానాపూర్ గ్రామాలలో సర్పంచ్‌లు లక్ష్మి, రమేష్, నర్సిములుతో కలిసి బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్‌చారీ మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం కేసిఆర్ కిట్‌లు, కల్యాణలక్ష్మి, శాదిముబారక్, బతుకమ్మ చీరలను అందజేసిన ఘనత టిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఆడపడుచులను సిఎం కేసిఆర్ పెద్దన్నల ఆదరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచయతీ కార్యదర్శులు యశ్వంత్, రమేష్, ఉప సర్పంచ్‌లు రాఘవేందర్, మల్లేష్, గ్రామపెద్దలు అంజిల్‌రెడ్డి, వెంకటయ్య, ఆనంద్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## లలితా త్రిపురసుందరీ దేవిగా దుర్గమాత భక్తులకు దర్శనం


అమ్మవారి పూజలో పాల్గొన్న చిన్నారులు.

**బొంరాస్‌పేట్, సెప్టెంబర్30, ప్రభాతవార్త :** దేవినవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గదేవి శుక్రవారం నాడు భక్తులకు లలితా త్రిపురసుందరి దేవిగా దర్శనమిచ్చింది. బొంరాస్‌పేట్ మండల వ్యాప్తంగా ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తుంకిమెట్ల గ్రామంలో భక్తులు అమ్మవారికి ఉదయం ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోని తమ మొక్కులను చెల్లించుకున్నారు. మండప నిర్వహకులు అమ్మవారికి భజనలు, ఆటపాటలతో దేవి నవరాత్రుల సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా విద్యుత్ దీపాలు, పచ్చటి తోరణాలతో అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## చించల్‌పేటలో బతుకమ్మ చీరలు పంపిణీ

**వికారాబాద్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** నవాబ్‌పేట్ మండలం చించల్‌పేట గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య బతుకమ్మ చీరలు మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బతుకమ్మ చీరలు పుట్టింటి వారు పంపిన చీరల భావించి ఆత్మీయతతో స్వీకరించాలని అన్నారు. బతుకమ్మ చీరలు మన కుటుంబ పెద్ద కెసిఆర్ పంపించారని, ప్రతి ఆడపడుచుకు బతుకమ్మ చీరలు అందజేయాలని ఉద్దేశంతో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల శుద్ధీకరణ అభినందనీయం


చెరువుల శుద్దీకరణ కార్యక్రమ దృశ్యం

**యాచారం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని చెరువు శుద్దీకరణ కార్యక్రమాన్ని శుక్రవారం బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం దయాకర్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాష పిలుపు మేరకు చెరువుల శుద్దీకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. చెరువులను శుభ్రంగా ఉంచుకుంటేనే పశువులు తాగడానికి, ఏవైనా అవసరాలకు, భూగర్భ జలాల పెంపుకు తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు తాంద్ర రవీందర్, సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌గౌడ్, శాంతి కుమార్, నడికుడి కృష్ణ, పాండురెడ్డి, పొర సంజీవ, వెంకటేష్, బన్నే శివ మోదీ, శ్రీకాంత్, గౌర లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## పాలసీదారులకు బోనస్‌ను పెంచే విధంగా చూడాలి

**పెద్దేముల్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** ఐఆర్‌డిఏ, కేంద్ర ప్రభుత్వం మేనేజ్మెంట్ పాలసీదారులకు ఇచ్చే బోనస్‌ను పెంచె విధంగా చూడాలని తాండూరు ఎస్ఓ లియాఫీ అధ్యక్షులు వడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. లియాఫీ ఆల్ ఇండియా జేఏసి అధ్వర్యంలో శుక్రవారం తాండూరు శాటిలైట్ కార్యాలయం ముందు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాంతియుత నిరసన కార్యాక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ పాలసీలపై జిఎస్‌టిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెంట్లకు ఇచ్చె కమీషన్ పెంచాలని, పాలసీ బాండ్లను పోస్ట్ ఆఫీస్ ద్వారా కాకుండా పాలసీదారులకు నేరుగా అందే విధంగా చూడాలని అన్నారు. పాలసీదారులు తీసుకునే రుణాలపై వడ్డి శాతాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. యాజమాన్యం దిగివచ్చి సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో లియాఫీ జాయింట్ సెక్రటరి జె.నర్సిములు, ట్రెజరర్ గురురాజ్ పటేల్, సెక్రటరి వెంకటరత్నం, హైదరాబాద్ డివిజన్ ఈసి మెంబర్ వెంకట్‌రెడ్డి, లియాఫీ, ఎల్ఐసి ప్రతినిధులు అంజయ్య, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, యం, వెంకటయ్య, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


తాండూరు ఎస్ఓ ముందు నినాదాలు చేస్తున్న, లియాఫీ ప్రతినిధులు, ఏజెంట్లు